క్లుప్తంగా

తక్కువ ధరకే నూనె ప్యాకెట్లు



విక్రయ కేంద్రాల ప్రారంభోత్సవంలో కలెక్టర్, జేసీ, డీఎస్‌ఓ తదితరులు

తిరుపతి అర్బన్: పలు ప్రైవేటు దుకాణాల్లో తక్కువ ధరకే నూనె ప్యాకెట్లు విక్రయిస్తున్నట్టు గురువారం సంబంధిత అధికారులు తెలిపారు. బేరివీధి, మంగళం రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సమీప ప్రాంతాల్లోని కొన్ని నిర్ణయించిన దుకాణాల్లో పామ్ ఆయిల్ రూ.117కి, సన్‌ఫ్లవర్ 128కి ఇస్తున్నట్టు చెప్పారు. ప్రైవేటు దుకాణాల్లో నూనె ప్యాకెట్లు విక్రయ కేంద్రాల ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి శేషాచలం రాజు పాల్గొన్నారు.

తిరుమలకు ఎన్‌సీసీ క్యాడెట్ల ట్రెక్కింగ్



శ్రీవారి దర్శనం చేసుకున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు

తిరుపతి సిటీ: తిరుపతి గ్రూప్‌కు చెందిన 35ఏ బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు తిరుమలకు ట్రెక్కింగ్ చేశారు. సుమారు 506మంది ఎన్‌సీసీ క్యాడెట్లు బృందం శ్రీవారిమెట్ల మార్గంలో గురువారం ఉదయం బయలుదేరి తిరుమలకు చేరుకున్నారు. అనంతరం ఎన్‌సీసీ అధికారులతో కలసి వారు శ్రీవారి సేవలో తరించారు.

నిబంధనలు మీరితే కేసులు: సీఐ



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ సుబ్బారామిరెడ్డి

చంద్రగిరి: రవాణా శాఖ నిబంధనలకు లోబడి ఆటో డ్రైవర్లు నడుచుకోవాలని, లేదంటే కేసులు తప్పవని చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని ఆటో డ్రైవర్లకు పోలీసు స్టేషన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్‌ఐలు రవీంద్ర నాయక్, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ మానసిక దినోత్సవం



రుయాను సందర్శించిన జడ్జి వాణిశ్రీ

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రి మానసిక విభాగం గురువారం ప్రపంచ మానసిక దినోత్సవం ఘనంగా నిర్వహించింది. మానసిక రోగులు, మత్తుకు బానిసైన వారికి అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.వాణిశ్రీ, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, హెచ్‌ఓడి డాక్టర్ పి.మల్లికార్జునరావు, డాక్టర్ కవిత, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ భారతి, డాక్టర్ భూపాల్ నాయుడు, సాయిరాజు, డాక్టర్ పవన్ డాక్టర్, మానసిక విభాగం సిబ్బంది, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మలబార్‌లో మైన్ డైమండ్స్ షో ప్రారంభం



మైన్ డైమండ్స్ షోను ప్రారంభిస్తున్న కస్టమర్లు

తిరుపతి కల్చరల్: బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఏర్పాటుచేసిన మైన్ డైమండ్స్ షో ప్రదర్శనను ప్రారంభించారు. షోరూం హెడ్ రిజీష్ మాట్లాడుతూ వినియోగదారుల సౌకర్యార్థం అధునాతన డిజైన్లతో కూడిన ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శన ఈనెల 13వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో రోజూవారీ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలతో పాటు ప్లాటినం ఆభరణాల సముదాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు కొనుగోలు చేయాలనుకున్న బంగారం విలువలో 10 శాతం అడ్వాన్స్ బుకింగ్ సదుపాయాన్ని పొందవచ్చని, అంతేకాక నగలు బుక్‌చేసిన రోజు ధర, లేదా నగలు కొనుగోలు చేసిన రోజు ధరను బట్టి ఏ ధర తక్కువ ఉంటే ఆ ధరే చెల్లించే అవకాశం ఉందని తెలిపారు.

సింహ వాహనంపై ఎల్లమ్మ

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మదేవి నవరాత్రి ఉత్సవాల్లో 7వరోజైన గురువారం రాత్రి శ్రీరాజరాజేశ్వరి అవతారంలో అమ్మవారు సింహవాహనంపై కొలుదీరి భక్తులను కటాక్షించారు. అంతకు ముందు అమ్మవారికి పూలంగిసేవను ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మమత, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వెరైటీ..కొట్టు గురూ..!



తేనీరు టీ, కాఫీ– అంటే ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఉదయం నిద్రలేవగానే టీ, కాఫీ పుచ్చుకునేవారు కోకొల్లలు. అంతేకాదు ఇంటి నుంచి బయటకు వెళ్లి పనిచేసి అలసిపోయే వారు ఇంటికి రాగానే లేదా బయట షాపుల్లో పొగలు కక్కే టీ తాగుతూ రిలాక్స్ అవడం పరిపాటి. అందుకే నగరంలో చాయ్ స్టాళ్ల సంఖ్య కూడా పెరుగుతోంది. అయితే ఎప్పటికప్పుడు టీ ప్రియులను ఆకర్షించేలా రకరకాల రుచులతో వివిధ రకాల కాఫీ, చాయ్‌లు అందుబాటులో ఉంచుతున్నాయి. అలాంటి వెరైటీ కోరుకునే వారికోసమే ఈ విశేషాలు..

నగరంలో విస్తరిస్తున్న చాయ్ కేఫ్స్

- పొద్దు పొద్దునే చాయ్ తాగాల్సిందే
- అందుబాటులో రకరకాల 'టీ'లు

తిరుపతి మంగళం : ×ఏ చాయ్ చటుక్కున తాగరా భాయ్/ఈ చాయ్ చమక్కులే చూడరా భాయ్/ఏ చాయ్ ఖరీదులో చీపురా భాయ్/ఈ చాయ్ ఖుషీలనే చూపురా భాయ్/ఏ చాయ్ గరీబుకు విందురా భాయ్/ఈ చాయ్ నవాబుకి బంధవే నోయ్/ఏ చాయ్ మనస్సుకీ మందురా భాయ్.₹ సినీ గేయ రచయిత చంద్రబోస్ రాసిన ఈ పాట మనందరికీ సుపరిచితమే. ఈ పాటలో పేర్కొన్నట్లే మార్కెట్లో ఎన్నో రకాల టీలు అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు నగరంలో చాయ్ ప్రియుల సంఖ్య కూడా అంతకంతకూ పెరుగుతూనే ఉంది.



టీలు వేస్తున్న తయారీదారులు



పొద్దు పొద్దునే టీ, కాఫీ కేఫ్‌లకు వచ్చి టీలు తాగుతున్న జనం

దీన్ని దృష్టిలో ఉంచుకుని చాయ్ కేఫ్‌లు కూడా భారీగా విస్తరిస్తుండటం, అలాగే రొటీన్‌కు భిన్నంగా పలు చాయ్ కేఫ్‌లలో పదుల సంఖ్యలో వెరైటీలు అందుబాటులో ఉంచుతుండడంతో 'టీ'ప్రియులను ఇవి ఇట్టే ఆకర్షిస్తున్నాయి.

రుచి, ఆరోగ్యకరమైన టీ, కాఫీలు...

తిరుపతిలోని పలు ప్రాంతాల్లో కాఫీ, టీ కేఫ్‌లు నోరూరించే కాఫీ, టీలతో పాటు ఆరోగ్యానికి దోహదం చేసే వివిధ రకాల సరికొత్త టీలను రుచిచూపుతున్నాయి. ఒక్కసారి రుచి చూస్తే మళ్లీ మళ్లీ తాగాలనుకునేలా కేఫ్‌లోని కాఫీ, టీల తయారీదారులు నోరూరించే తేనీరుతో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

అందుబాటులో వెరై 'టీ'లు

ఎక్కువగా గ్రీన్, బ్లాక్, హనీ టీలతో పాటు అల్లం, పుదీనా, బాదం, షుగర్‌లెస్, ఇలాచి, స్పెషల్, మసాలా చాయ్‌లు తేనీటి ప్రియులు ఇష్టపడి తాగుతారు. వాటితో పాటు హెర్బల్, హనీగ్రీన్ టీ, ఆమ్లా గ్రీన్ టీ, లెమన్ టీ, సొంటి పాల్ వంటి వివిధ రకాల టీ, కాఫీలు, క్యాపిచినో, జెమిని ఆరోమా, స్పెషల్ చాయ్‌లు కేఫ్‌లలో అందుబాటులో ఉంటున్నాయి.

ప్రపంచ ప్రసిద్ధి చెందిన రకాలు

ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన డేవిడ్ ఆఫ్ జర్మనీ, అరకు కాఫీ, టీలు, ఆర్గానిక్ ఇండియా, ట్విన్సింగ్ ఆఫ్ లండన్, శ్రీలంక దిల్మా, గ్రీన్స్మట్ హిమాలయ, జీ హపోతో పాటు ఆరోగ్యానికి సంబంధించిన హెయిర్ గెయిన్, స్కిన్‌గ్లో వంటి టీ రకాలు, వెయిట్ లాస్ కిక్ స్టార్ట్, కూల్ మడౌన్, ఫ్రూట్ బూస్టర్.. ఇలా వివిధ రకాల కాఫీలు, చాయ్‌లు నగరంలోని స్టార్‌హోటళ్లలో అందిస్తున్నారు.

పొద్దున్నే టీ తాగాల్సిందే



పొద్దు పొద్దున్నే టీ తాగాల్సిందే. లేదంటే ఏదో కోల్పోయినట్లు ఉంటుంది. ఉదయాన ఒక టీ కడుపులో పడగానే ఎక్కడలేని హుషారు వస్తుంది. మైండ్ కూడా చాలా చురుగ్గా పనిచేస్తుంది. ఆఫీసులో పని ప్రారంభించే ముందు, లంచ్ తర్వాత, సాయంత్రం ఇంటికెళ్లే ముందు ఒక టీ తాగితే ఆ రోజు చేసిన కష్టమంతా మరిచిపోయి ప్రశాంతతను ఇస్తుంది. **- నాగరాజు, తిరుపతి**

ఆరోగ్యాన్ని కాపాడుతాయి



రుచికరమైన టీలే కాదు. మన ఆరోగ్యాన్ని కాపాడే టీలు కూడా ఎన్నో ఉన్నాయి. అందుకే నేను వాటినే ప్రిఫర్ చేస్తాను. రోజూ వాటినే తాగుతాను. రుచికి..రుచి..మరోవైపు ఆరోగ్యానిచ్చే టీలు పుచ్చుకోవడం మంచిదే కదా. ప్రస్తుతం అన్ని టీ షాపులలో ఇలాంటి టీలు ఉంటాయి. **-చంద్రశేఖర్, తిరుపతి**



వేడుకగా బంగారు గొడుగు ఉత్సవం

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆనవాయితీగా నిర్వహించే బంగారు గొడుగు ఉత్సవం గురువారం సాయంత్రం తిరుమలలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన కల్యాణకట్టలో బంగారు గొడుగుకు ప్రత్యేక పూజల అనంతరం టీటీడీ ఈఓ శ్యామల రావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి అప్పగించారు. ఈఓ మీడియాతో మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచి బంగారు గొడుగు ఉత్సవానికి ఉన్న విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.

నృత్య నీరాజనం



తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. గురువారం రాత్రి తిరుపతి ఎస్వీ మ్యూజిక్ కళాశాల భరతనాట్యం అధ్యాపకులు హరినాథ్ శిష్య బృందం ప్రదర్శించిన కంటిమి నేడిదే గరుడా చలపతి.. చూడరమ్మా సతులారా.. అదివో అల్లదివో శ్రీహరి వాసము.. అనే అన్నమాచార్య కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. శ్రీ వేంకటేశ్వరస్వామి వేషధారణలో చిన్నారి లలంతికనాథ్ అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో పద్మ, హేమచంద్రిక, తేజస్విని, నిషిత, నిత్య, జ్ఞానదీపిక, పద్మజ, తేజశ్రీ, ప్రణవి, మౌనిక, శాంతిశ్రీ, తోరణ, సువర్ణ, మూనిక, లోలిత, జాహ్నవి, సోనుప్రియ, శాన్వీ, వినిత్యా చౌదరి, కీర్తన, హవిష, చాతుర్య, రిషిక, లలిత, జోత్స్న,వర్షిత, సాహితి, చిన్మయి, హరి మానస, భవిత తదితరులు తమ విద్వత్తును చాటారు.

దివ్వెల మాధురిపై కేసు నమోదు

తిరుపతి క్రైమ్: తిరుమలలో శ్రీవారి ఆలయం ముందు రీల్స్ చేయడంపై దివ్వెల మాధురి తిరుమల టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల ఏడో తేదీన దివ్వెల మాధురి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయం ముందు రీల్ చేయడంపై ఏవీఎస్ మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సిండి'కేటు'గాళ్ల చేతిలో 'కిక్'..!

- పాకాల మండలంలో 5 మద్యం షాపులకు కేవలం 11 దరఖాస్తులే..!
- ఎవరు దరఖాస్తు చేసినా షాపు మాత్రం తెలుగు తమ్ముళ్లకేనట!
- బెదిరింపులకు ధాటికి ముందుకురాని వ్యాపారులు

తిరుపతి టాస్క్‌ఫోర్స్: తెలుగుదేశం పార్టీ నాయకుల హెచ్చరికలు, బెదిరింపుల ధాటికి పాకాల మండలంలో మద్యం షాపులకు దరఖాస్తులు వేసేందుకు అనుభవం ఉన్న వ్యాపారులు ముందుకురావడం లేదు. మండల కేంద్రంలో 2, దామలచెరువులో 2, నేంద్రగుంటలో 1 మద్యం షాపునకు దరఖాస్తులు కేవలం 11 మాత్రమే వచ్చాయంటే ఇక్కడ అధికార పార్టీ నేతలు సిండికేట్ అయి ప్రభుత్వ ఆదాయానికి ఎంతగా గండికొడుతున్నారో ఇట్టే బోధపడుతోంది. చంద్రగిరి సర్కిల్ పరిధిలో పాకాల, యర్రావారిపాళ్యం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి మండలాలు ఉన్నాయి. ఎవరు దరఖాస్తు చేసినా మద్యం షాపు తమ పార్టీ వారికే అప్పజెప్పాలని ప్రజాప్రతినిధి కార్యాలయం అల్టిమేటం ఇవ్వడంతో ఔత్సాహిక, అనుభవం ఉన్న వ్యాపారులు నీరుగారిపోయారు. అధికార బలంతో, పెద్దల అండదండలతో మండల నాయకులు చేస్తున్న ఆగడాలకు భయపడి వీరంతా దరఖాస్తులు వేసేందుకు వెనుకంజ వేశారు.

సర్కిల్ పరిధిలో 17 దుకాణాలకు 96 దరఖాస్తులు

చంద్రగిరి సర్కిల్ పరిధిలో మొత్తం 17 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 96 దరఖాస్తులు మాత్రమే అందాయి. పాకాల మండలం 11, ఎర్రావారిపాళ్యం మండలం 2 షాపులకు 16 దరఖాస్తులు, చిన్నగొట్టిగల్లు మండలంలో 3 మద్యం షాపులకు 21 దరఖాస్తులు, చంద్రగిరిలో 7 మద్యం షాపులకు 48 దరఖాస్తులు అందాయి. నాయకుల దౌర్జన్యం మూలానే ఇంత తక్కువగా వచ్చాయనేది సుస్పష్టం. చివరి రోజైన శుక్రవారమైనా ఎవరైనా ధైర్యం చేసి ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

నకిలీ బంగారంతో ఘరానా మోసం

చంద్రగిరి: తన పొలంలో బంగారం దొరికిందని, తక్కువ ధరకే విక్రయిస్తానంటూ నమ్మబలికి దంపతుల వద్ద రూ.5 లక్షలు కాజేసిన ఘటన మండలంలోని ఏ.రంగంపేటలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. ఏ.రంగంపేటకు చెందిన పూజారి సుబ్రమణ్యం ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలల క్రితం కర్నూలుకు చెందిన రమేష్ అనే వ్యక్తి తిరుపతికి వచ్చి సుబ్రమణ్యంకు పరిచయం అయ్యాడు. తరచూ తిరుపతికి వస్తుంటామని, మాకు అన్ని ఆలయాలు చూపించాలని కోరుతూ ఫోన్ నంబరు అడిగి తీసుకున్నారు. ఈ క్రమంలో ఇటీవల తమ పొలంలో బంగారం దొరికిందని, 3.5 కిలోల బంగారాన్ని విక్రయిస్తానంటూ నమ్మబలికాడు. తొలుత గ్రాము బంగారాన్ని సుబ్రమణ్యంకు ఇవ్వడంతో దాన్ని బంగారు దుకాణం వద్దకు వెళ్లి తనిఖీ చేయించాడు. తనిఖీలో నిజమైన బంగారం అని తేలడంతో ఆశపడిన సుబ్రమణ్యం రమేష్‌ను సంప్రదించాడు. తనకు రూ.10 లక్షలు ఇస్తే ఈ బంగారం అంతా ఇస్తానని చెప్పాడు. తన దగ్గర రూ.5 లక్షలే ఉందని సుబ్రమణ్యం చెప్పడంతో, ముందుగా రూ.5 లక్షలు ఇవ్వాలని తర్వాత మిగిలిన మొత్తాన్ని చెల్లించాలని చెప్పి నకిలీ బంగారాన్ని సుబ్రమణ్యంకు అందజేశాడు. నకిలీ బంగారాన్ని తీసుకెళ్లిన సుబ్రమణ్యం ఇంటికి వెళ్లి పరిశీలించగా అది నకిలీ బంగారం అని గుర్తించాడు. అనంతరం రమేష్‌కు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధితుడు కొనుగోలు చేసిన నకిలీ బంగారం

శిల్పారామంలో దసరా వేడుకలు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో దసరా వేడుకలను ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి 13వ తేదీ వరకు ప్రతి రోజూ వివిధ సాంస్కృతిక, జానపద కార్యక్రమాలను నిర్వహిస్తారు. తొలిరోజు తిరుపతికి చెందిన అర్ధనారీశ్వర కూచిపూడి డ్యాన్స్ అకాడమీ కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారులు

దర్శనం..మహద్భాగ్యం



చంద్రప్రభ వాహన సేవలో ఈవో దంపతులు , అదనపు ఈవో , సినీ నటుడు బాలకృష్ణ సతీమణి వసుంధర





వాహన సేవలో తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు , మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్

రతన్ టాటాకు శ్రద్ధాంజలి

తిరుపతి(అలిపిరి): పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం సాయంత్రం టాటా క్యాన్సర్ హాస్పిటల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. దేశ పారిశ్రామిక రంగ అభివృద్ధిలో రతన్ టాటా చెరగని ముద్ర వేశారని, తిరుపతిలో రూ.250 కోట్లతో టాటా క్యాన్సర్ హాస్పిటల్ స్థాపించి పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్న మహోన్నతుడు రతన్ టాటా అని కీర్తించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, దంపూరి భాస్కర్, డాక్టర్ ప్రశాంత్, మహేష్ యాదవ్, బాల్జీ, కేఎంకే లోకేష్, రుయా ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ వర్కింగ్ చైర్మన్ లక్ష్మీపతి రాయల్, రమణరాజు పాల్గొన్నారు.

తిరుపతి కల్చరల్: రతన్ టాటాకు రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, కె.మునిరత్నం, సుబ్రమణ్యంరెడ్డి, వాసు, మురళి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణయ్య, మునస్వామి, శంకరయ్య పాల్గొన్నారు.

రతన్ టాటా సేవలు స్ఫూర్తిదాయకం

తిరుపతి కల్చరల్: రతన్ టాటా మృతి బాధాకరమని, దాతృత్వంతో సమాజానికి ఆయన అందించిన ఎనలేని సేవలు స్ఫూర్తిదాయకమని రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ లింగుట్ల ప్రస్తుతించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రతన్ టాటా మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రతన్ టాటాకు భారతరత్న ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కలాం ట్రస్ట్ ప్రతినిధి బాషా, దేవరాజు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

రతన్‌టాటాకు ఘన నివాళి

పాకాల: దేశంలో దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు గురువారం పాకాలలో వినియోగదారుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు మునిప్రభాకర్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. సమితి చిత్తూరు జిల్లా డివిజన్ అధ్యక్షుడు కలికిరి నారాయణస్వామి, జనార్ధన్‌నాయుడు, తిరుమలనాయుడు, రాజేష్, జేసీబీ భూమ పాల్గొన్నారు.

దుర్గాదేవి అలంకరణలో గంగమ్మ దర్శనం

తిరుపతి కల్చరల్: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం తాతయ్యగుంట గంగమ్మ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, దేవి హోమం, సహస్రనామార్చన, రాత్రి అమ్మవారిక ఉయ్యాలసేవ నిర్వహించారు. ఆలయ ఈవో ఏ.జయకుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ఆరోగ్య భారత్ ప్రతి ఒక్కరి బాధ్యత

– ఆదాయపు పన్నుశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్లా

తిరుపతి రూరల్: ఆరోగ్య భారత్ కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని ఆదాయపు పన్నుశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్లా పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా గురువారం తిరుపతిలోని ఆదాయపు పన్ను శాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి ఘంటసాల విగ్రహం, వీవీమహల్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం, తిలక్‌రోడ్డు మీదుగా స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. సునీత బిల్లా జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. కార్యాలయంలో పాత రికార్డ్స్, తొలగించడంతోపాటు ఈ–వేస్ట్‌ను క్లీన్ చేశారు. కార్యక్రమంలో ఆదాయపు పన్నుశాఖ జాయింట్ కమిషనర్ వంశీధర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆదాయపు పన్నుశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్లా

బ్యాంక్ ఆఫ్ బరోడా మెయిన్ బ్రాంచ్ ప్రారంభం


తిరుపతి(అలిపిరి): తిరుపతిలో ఉత్తమ మౌలిక సదుపాయాలతో గురువారం బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రధాన బ్రాంచ్‌ను ప్రారంభించారు. తిరుపతిలో దాదాపు లక్ష మంది కస్టమర్లకు బ్యాంకింగ్ సౌకర్యాలను అందిస్తున్నట్టు మెయిన్ బ్రాంచ్ రీజినల్ హెడ్ పి.అమరనాథరెడ్డి తెలిపారు. బ్యాంకు జోనల్ జనరల్ మేనేజర్ రితేష్ కుమార్ మాట్లాడుతూ, తమ బ్యాంకుకు గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్‌ను ఎంపిక చేసుకున్నట్లు చెప్పారు. ×బీవోబీ మాస్టర్ స్ట్రోక్ సేవింగ్స్ అకౌంట్₹ను పరిచయం చేస్తూ ఈ ప్రీమియం బ్యాంక్ ఖాతా పలు సేవలను అందిస్తుందన్నారు. బ్రాంచ్ హెడ్ బి.శ్రీనివాసులు, ఎంవీఎస్ సుధాకర్, శ్రీరామమూర్తి తదితరులుపాల్గొన్నారు.



మెయిన్ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

దసరా పూజలు

తిరుపతి కల్చరల్: రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో గురువారం కొర్లగుంట శ్రీప్రసన్న భారతి స్కూల్లో సంజయ్ గాంధీ కాలనీ మహిళలు సామూహిక దసరా మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడారు. సృష్టికి మూలమైన మహిళలు సామూహిక వ్రతాలు, పూజలు, కైంకర్యాలు క్రతువులు చేయడం కుటుంబాలకు, సమాజానికి మంచి ఫలితం ఇస్తాయని పేర్కొన్నారు. అనంతరం పేద వృద్ధులకు చేతి కర్రలు, దుప్పట్లు, రెండు, మూడు చక్రాల సైకిళ్లు, వినికిడి పరికరాలు పంపిణీ చేశారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాస్ ప్రతినిధులు నాగేశ్వర్ ,వాణి, రామాంజులు, సీతమహాలక్ష్మి, క్లస్టర్ లీడర్లు దేవి, కవిత, మహిళలు పాల్గొన్నారు.



చక్రాల సైకిళ్లు వితరణ చేస్తున్న రాస్ ప్రతినిధులు